


# ఫారిన్ వెళ్ళాల(న)ండీ

## - వసుంధర



***మనం ఎంత ఆధునికమైనా, చరిత్రకున్న విలువ మరువలేనిది. అలానే ఈ రోజుల్లో ఎప్పుడు కావాలంటే అప్పుడు ఎక్కడికైనా వెళ్ళగలిగే సౌకర్యాలు( డబ్బులుంటే చాలు) ఉన్నాయి కానీ కొన్ని దశాబ్దాల క్రిందట (1970 దశకం ప్రారంభంలో) ఇలాంటి ప్రయాణాల వెనుకనున్న సాధకబాధకాలు తెలుసుకోవడం ఇప్పటికీ ఆసక్తికరంగా ఉంటుంది. -సం.***

*(గత సంచిక తరువాయి)*

1974–75 వాతావరణంలో అప్పటి పశ్చిమజర్మనీ దేశం ఈ రచనలోని సన్నివేశాలకు వేదిక. ఆ సన్నివేశాలను వివరించినది – అప్పటి వాతావరణంలో సంప్రదాయబద్ధంగా పెరిగి, ఆధునికతని అవగాహన చేసుకుంటున్న ఓ మధ్యతరగతి భారతీయుడు. వృత్తిరీత్యా సైంటిస్టు.

అప్పటికి ఇండియాలో టివిలు కొన్ని మహానగరాలకే పరిమితం. టెలిఫోన్లు వ్యాపారస్థులకీ, భాగ్యవంతులకీ, ఉన్నతోద్యోగులకే అందుబాటు. కంప్యూటర్లది పాశ్చాత్యదేశాల్లోనూ పెద్ద గదిని కేటాయించాల్సినంత పరిమాణం. మొబైల్సు, ఇంటర్నెట్ వగైరాలు వాడుకలోకొస్తాయన్న ఊహ కూడా లేదు.

ఇండియాలో ఇప్పుడు గ్రామాలకున్న సదుపాయాలు, అప్పుడు మహానగరాలకే లేవు. ఆ నేపథ్యాన్ని స్మరించి – రచయితతోపాటు పాఠకులూ 1974లో పయనించి – చదవడం మొదలెడితే – ఈ రచనలోని చాలా విశేషాలు మరింత రసానుభూతినిస్తాయి. ఐతే 2016–17లోనూ – 'మనం ఎక్కణ్ణించి ఎక్కడికొచ్చాం? ఎక్కడికి పోతున్నాం?' అనే భావనను కలిగించి ఆలోచింపజెయ్యగలిగితే, ఈ రచన సార్థకమౌతుంది.

అంశాల పరంగా ఇది రెండు భాగాల రచన. మొదటిది ల్యూనబర్గులో 'పీజీ టు కేజీ' గత మాసంలో ముగిసింది. ఇప్పుడు రెండవది 'బెర్లిన్ ద్వీపే డాయిచ్ ఖండే'లో తొలివిడతగా 'ఫన్ నేనొక్కడినే'. ఇందులో అంశాల్ని జరిగిన వరుస క్రమంలో కాక – పాఠకులకు అనువుగా ఉండేందుకు ఉపశీర్షికల్లో వివరించడం జరిగింది.

రసానుభూతితోపాటు, ప్రయోజనాత్మకమూ కావాలన్న మా తపన అక్షరరూపం దాల్చడానికి స్ఫూర్తినిచ్చిన కౌముదికి హృదయపూర్వకంగా ధన్యవాదాలు తెలుపుకుంటూ, రచనలోకి అడుగెడుతున్నాం.

# రెండవ భాగం: బెర్లిన్ డీప్ పే డొయిచ్ ఖండే

*తొలి రోజు*

నిన్నటి అనుభవముందిగా – స్టేషన్లో దిగీ దిగగానే ముందు సూట్‌కేస్ లాకర్లో పెట్టేశాను. లాకర్ రుసుము హానోఫర్లో ఒకటిన్నర మార్కులు కానీ, ఇక్కడ అర మార్కే. అంటే యాబై ఫెనిగ్స్.

అదయ్యేక ముందోసారి స్టేషనంతా తిరిగాను.

స్టేషన్ చాలా పెద్దది. వాతావరణం కొత్తగా ఉంది. నెమ్మదిగా స్టేషన్నించి బయటపడి చుట్టూ చూస్తే –

కళ్ళు చెదిరిపోయాయి.

అంతవరకూ చూసిన హానోఫర్, హ్యాంబుర్గ్, ల్యూబెక్ నగరాలన్నీ ఒకెత్తు, ఈ నగరమొక ఎత్తు – అనిపించింది.

స్టేషన్ బయటకు రాగానే ఎదురుగా ఒక చర్చిలాంటిది కనిపించింది. ఆ చర్చి గోపురం కూలిపోయింది. అదేమిటో, అంత సంపన్నదేశంలో దాన్నలా ఎందుకు వదిలేశారో అప్పుడు నాకు తెలియలేదు. రెండవ ప్రపంచయుద్ధంలో జరిగిన బాంబింగ్‌కి గుర్తుగా దాన్నలా వదిలేశారని  తర్వాత తెలిసింది.

ఆ చర్చి వెనుకనే 22 అంతస్తుల భవంతి ఉంది. అది ఐరోపా సెంటర్. పై అంతస్తుమీద – ఊళ్లో ఎక్కణ్ణించి చూసినా కనబడేలా ఒక వలయం తిరుగుతోంది. అందులో ఎన్నో షాపులు, సినిమా థియేటర్లు, ఆటస్థలాలు, క్లబ్బులు, ఆఫీసులు వగైరాలున్నాయి.

కళ్లముందు తళతళ మెరిసిపోతున్న రోడ్లు, తూనీగల్లా దూసుకుపోతున్న కార్లు, కళ్లు చెదిరిపోయేలా షాపులు.

ఒక పల్లెటూరివాడు మొదటిసారిగా బొంబాయిలో అడుగు పెట్టినట్లుంది నా స్థితి.

ధైర్యం తెచ్చుకుందుకు సుమారు పది నిముషాలు పట్టింది.

మనసులో వేరే భయం –

ఆ భయం నగరం పరిమాణాన్ని చూసి కాదు. దేశం కాని దేశంలో, ఇంతటి మహానగరంలో ఉండడానికి నాకో చిన్న గది ఎలా దొరుకుతుంది? దొరికినా అద్దె నాకు అందుబాటులో ఉంటుందా?

బెర్లిన్లో టెక్నికల్ యూనివర్సిటీలో భాగమైన ఇన్‌స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ కెమికల్ టెక్నాలజీ)లో డాక్టర్ రాలెక్‌తో కలిసి నేను పని చేయాల్సి ఉంది. అప్పటికి నేను నా మకాం ఏర్పాట్ల గురించి డాక్టర్ రాలెక్‌కి ఉత్తరం రాసి ఉన్నాను. ఆయన నా గురించి గది చూసి ఉండొచ్చు. చూసి ఉండకపోతే, నేనే గది వెతుక్కోవాలి. గది దొరికేదాకా ఏదైనా హటల్లో రూం తీసుకుని ఉండాలి.

జర్మనీలో లాడ్జింగు ఛార్జిలు నాకు అందుబాటులో ఉండవని తెలుసు.

డబ్బు. అది దండిగా ఉంటే మనిషి ఆలోచనలు మరో విధంగా ఉంటాయి. నా పరిస్థితి వేరు. వేసే ప్రతి అడుగులోనూ డబ్బు ఆలోచన రాక తప్పదు. అలాగని అధైర్యపడిపోకూడదు.

మనసుకి ధైర్యం చెప్పుకుని తక్షణకర్తవ్యమేమిటా అని ఆలోచించాను.

ముందు నా ఇన్‌స్టిట్యూట్‌కి వెళ్లాలి. టాక్సీని పిలిస్తే దారీ, అదీ టాక్సీవాలాయే చూసుకుంటాడు. నేరుగా ఆఫీసుకి వెళ్లిపోవచ్చు. కానీ అదిక్కడికి ఎంత దూరమో తెలియదు. కొత్త చోటు. కొత్తవాడినని తెలిసి టాక్సీవాలా ఎంతడుగుతాడో ఏమో!

డబ్బు. మళ్ళీ డబ్బే– నా ఆలోచనల్ని ముందుకు నడిపిస్తూ శాసించింది.

చేతిలో సామాను లేదు. కాళ్లలో నడిచే ఓపిక ఉంది.

నాకు తెలిసి ఈ దేశంలో ప్రతి రైల్వే స్టేషన్లోనూ నగరానికి మార్గదర్శకంగా ఓ పటం ఉంటుంది. దాన్ని పట్టుకుంటే అది చూసి ముందు నా ఇన్‌స్టిట్యూట్ రైల్వే స్టేషనుకి ఎంత దూరంలో ఉందో తెలుసుకోవచ్చు. అందుకోసమని స్టేషనంతా కలయదిరిగాను. కానీ ఎక్కడా పటం కనబడలేదు.

అదేపనిగా మళ్లీ మళ్లీ తిరిగాను. పటం కనబడలేదు.

చివరికి కనబడ్డవాళ్లలో కాస్త అనువుగా అనిపించినవాళ్లని పలకరిస్తూ వాకబు మొదలెట్టాను.

నేను సరిగ్గా చెప్పలేకపోయానో ఏమో – కొంతమంది అర్థం కాక పటం ఏమిటన్నట్లు అదోలా చూశారు. అర్థం చేసుకున్నవాళ్లలో కొందరు టూరిస్ట్ గైడ్ పుస్తకాలు అమ్మే షాపులు చూపించారు.

ఇలా ఊళ్లో దిగగానే అలా టూరిస్ట్ గైడ్ పుస్తకాలకోసం డబ్బు ఖర్చుపెట్టడం నాకిష్టం లేదు. టైం కూడా చాలా ఉంది కాబట్టి పట్టు వదలని విక్రమార్కుడిలా ప్రయత్నించాను. చివరికి ఓ దారి కనిపించింది.

మన దేశంలో ముంబై వంటి పెద్ద నగరాల్లో ఉన్నట్లే ఇక్కడా లోకల్ రైల్వే సర్వీసుంది. ఎటొచ్చీ ఇక్కడ అది రెండు మార్గాల్లో ఉంటుంది. ఒకటి ఊ బాన్ అంటే అండర్‌గ్రౌండ్ రైల్వే. ఒకటి ఎస్ బాన్ (ష్నెల్ అంటే వేగంగా పోయే, బాన్ అంటే రైలు). ఎస్ బాన్ – భూమ్మీద కట్టిన వంతెనమీద రైల్వే మార్గం.

నాకు కావాల్సిన నగర పటం – ఆ స్టేషన్‌లోనే ఉన్న అండర్‌గ్రౌండ్ రైల్వే స్టేషన్లో దొరికింది. అందులో చూస్తే – నేను వెళ్లాల్సిన ఇన్‌స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ (ఇన్‌స్టిట్యూట్ ఫర్ కెమికల్ టెక్నాలజీ) స్టేషనుకి చాలా దగ్గర్లో ఉంది.

ఒక కాగితంమీద వివరాలు, గుర్తులు వ్రాసుకున్నాను. స్టేషను బయటికొచ్చి పటంలో సూచించిన దారిలో నడక ప్రారంభించాను. స్టేషన్లో లభించిన వివరాలు ఎంత స్పష్టంగా ఉన్నాయంటే – సరిగ్గా పదిహేను నిముషాల్లో ఆ సంస్థని చేరుకోగలిగాను.

ఇన్స్టిట్యూట్ ఫ్యూర్ టెక్నిషే షెమీ ఆరంతస్తుల భవనం. చూడగానే అందులో ఏడాదిపాటు పనిచెయ్యబోతున్నానన్న భావన నాలో ఉద్వేగాన్ని కలిగించింది.

కింది అంతస్తులో ప్రవేశద్వారం చేరి తలుపు తొయ్యగానే పెద్ద హాలు. అక్కడే ఉంది రిసెప్షన్. అక్కడ నన్ను పరిచయం చేసుకుని డాక్టర్ రాలెక్ గురించి అడిగాను. ఆయన రెండో అంతస్తులో ఉంటాడని తెలిసింది.

అక్కడ లిఫ్టు ఉంది. అది భువనేశ్వర్లో మా ఆఫీసు లిఫ్టుకి కనీసం మూడు రెట్లు పెద్దది. అందులో పైకి వెళ్లాను. అక్కడ కనబడిన వాళ్లని వాకబు చేస్తే – అప్పటికి రాలెక్ ఇంకా డిపార్ట్‌మెంటుకి రాలేదని తెలిసింది. ఆయనింకా రాకపోతేనేం, ఆయనుండే చోటుకే చేరానన్నమాట.

చేరాల్సిన చోటుకి సులభంగా చేరుకున్నానన్న సంతోషంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాను.

రాలెక్ రావడానికి ఇంకా టైముందని తెలిసింది. ఈలోగా ఇంకేమైనా చక్కబెట్టుకోవాల్సిన పనులున్నాయా అని ఆలోచనలో పడ్డాను. రైల్వే స్టేషన్నించి నా అంతట నేను కాలినడకన ఆ సంస్థని చేరుకోగలగడం నా ఆత్మస్థైర్యాన్ని పెంచింది.

నేనిప్పుడు చేరుకున్న భవనం టెక్నిషే యూనివర్సిటేట్‌కి (యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ) అనుబంధ సంస్థ. ఆ యూనివర్సిటీ కార్యాలయం ఈ భవనానికి ఎదుటనే ఉన్నట్లు తెలిసింది. ఒకసారి చూసొద్దామనుకున్నాను.

అందుకు రోడ్డు క్రాస్ చెయ్యాలంతే!

రోడ్డు చాలా పెద్దది. నాలుగు లేన్లలో – అటూ ఇటూ వన్‌వే ట్రాఫిక్కున్న రెండు భాగాల ఆ రోడ్డు – కారులే నీళ్లనిపించే జీవనదిలా ఉంది. అందులో నియమోల్లంఘనమనే మొసళ్లు లేకపోవడంవల్ల అవతలివైపుకు అనాయాసంగానే చేరుకోగలిగాను.

యూనివర్సిటీ కార్యాలయమున్న ఆ భవనం చాలా పెద్దది. రెండవ ప్రపంచయుద్ధంలో ఆ భవనం బాంబింగుకి గురైందిట. పునర్నిర్మాణంలో – బాగున్నమేరకు అలాగే ఉంచి, మిగతాదంతా కొత్తరకం ప్లానుతో అనుసంధించి పెద్ద భవనంగా కట్టేరుట. అందువల్ల లోపల చాలా గజిబిజిగా ఉంటుంది. ఒకసారి అందులో అడుగు పెట్టేక కొత్తవారికి అందులోంచి బయటపడ్డం కష్టమే. ఆ క్షణంలోనే నేనా భవనానికి మయసభ అని పేరు పెట్టుకున్నాను.

ఆ మయసభలో విదేశీయుల సహాయార్థం ఓ ఆఫీసుందని తెలుసు. వాకబు చేసుకుంటూ ఆ ఆఫీసుకి వెళ్లాను. వాళ్లు నా వివరాలు నోట్ చేసుకుని 'జిమ్మర్ పెర్మిట్లుంగ్' (అకామడేషన్ సర్వీస్) చిరునామా ఇచ్చారు. ఇల్లు వెదకడంలో 'జిమ్మర్ పెర్మిట్లుంగ్' వాళ్లు నాకు సాయపడగలరట.

ఆ తర్వాత ఆ భవనంలోంచి బయట పడదామంటే నావల్ల కాలేదు. వాళ్లనీ వీళ్లనీ అడిగి కష్టంమీద బయటకొచ్చాను. కార్ల జీవనదిలో ఈదుకుంటూ తిరిగి ఎదుటి భవంతికి వెళ్లి లిఫ్టులో రెండో అంతస్తు చేరుకున్నాను.

అప్పటికి డాక్టర్ రాలెక్ వచ్చేడు. ఆయన అక్కడివాళ్లలాగే చాలా తెల్లగానూ, అక్కడివాళ్లు చాలామందికంటే చాలా పొడుగ్గానూ ఉన్నాడు. వెనుకనుంచి ఎవరో తరుముతున్నట్లు హడావుడిగా మాట్లాడ్డం ఆయనకు అలవాటు అనిపించింది. నాతో పూర్తిగా జర్మన్ భాషలోనే మాట్లాడేడు.

నాలుగు నెలల గ్యోతే ఇన్‌స్టిట్యూట్ శిక్షణ ఊరికే పోలేదు. నాకు రాలెక్ మాటలు అర్థం కావడమే కాదు, నేను కూడా ఆయనతో జర్మన్లోనే ధారాళంగా సంభాషించగలిగాను.

ఐతే రాలెక్ ఉభయభాషా ప్రవీణుడు. అందువల్ల జర్మన్ పదాలు స్ఫురించనప్పుడు కురుక్షేత్రంలో కర్ణుడిలా నీరసించిపోకుండా ధైర్యంగా ఇంగ్లీషుకి మారిపోతూ మ్యానేజ్ చేశాను.

అప్పటికి రాలెక్ నా మకాంకోసం తనవంతు కృషి కొంత చేశాడు. అక్కడ స్టూడెంట్ హాస్టల్లో రెండు వారాలకుగానూ నాకోసం ఓ గది బుక్ చేశాడట. అక్కడుంటూ, ఈలోగా నేను నాకోసం ఇల్లు వెతుక్కోవాలిట.

హోటల్ రూం అగత్యం తప్పిందని మహదానందమైంది. కానీ రెండు వారాల్లో అద్దె ఇల్లు దొరుకుతుందా అన్న బెంగ కూడా మనసులో ఉంది.

రాలెక్ శిష్యుల్లో అహమ్మద్ అనే ఇరాక్ దేశస్థుడు ఉన్నాడు. నాకూ రాలెక్‌కీ జరిగిన ఉత్తరప్రత్యుత్తరాల ఫైలు అహమ్మద్ దగ్గరే ఉంది. రాలెక్ నన్ను అహమ్మద్‌కి పరిచయం చేసి, ఇల్లు వెదకడంలో నాకు సాయపడమని చెప్పాడు.

ఆ సంస్థలో నా తొలి మిత్రుడు అహమ్మద్. రాలెక్ నన్నప్పగించగానే అతడు తన గురించి చెప్పుకున్నాడు.

తనూ నాకులాగే డాడ్ ఫెలోషిప్ మీద వచ్చాడు. ఐతే అతనికి స్వదేశంనుంచి కూడా అదనపు భత్యం వస్తుందిట.

అహమ్మద్ నా వివరాలు కూడా అడిగి తెలుసుకున్నాడు. అక్కడివాళ్లకు భిన్నంగా నాతో ఎక్కువ ఇంగ్లీషులోనే మాట్లాడాడు.

అతనికి ఇంగ్లీషంటే మోజుంది. ఇండియన్స్ ఇంగ్లీషు బాగా మాట్లాడగలరన్న అభిప్రాయముంది.

మా అహమ్మద్ మిత్రుడి భాషాపరాక్రమమేమని చెప్పవచ్చునని నేను మెచ్చుకుంటే – చాలా సంబరపడ్డాడు.

ఇద్దరం జిమ్మర్ పెర్మిట్లుంగ్‌కి వెళ్లాం. వాళ్ల దగ్గర కొన్ని ఇళ్ల వివరాలున్నాయి. వాళ్లకి నేను కొంత ధరావతు కడితే – వాళ్లు నాకు గృహాన్వేషణకు సహకరించే కొన్ని వివరాలిస్తారు. వాటి ఆధారంతో నేను నా ప్రయత్నాలు చేసుకోవాలి. నాకు ఇల్లు దొరికేక – ఆ విషయం వాళ్లకు తెలియబరిస్తే, నేను కట్టిన ధరావతు వెనక్కిచ్చేస్తారుట.

ఆసక్తిగా వాళ్లిచ్చిన ఫైలు తీసుకున్నాను. ఆత్రుతగా ఆ ఫైల్లో నా తాహతుకు తగ్గ ఇంటికోసం వెదుకున్నాను.

అంతలో అక్కడి ఉద్యోగికి ఓ ఫోనొచ్చింది. ఆ ఫోను అద్దెకిచ్చే ఇళ్ల గురించే కాబోలు – అతడు అహమ్మద్‌కి జర్మన్లో ఆ వివరాలు చెప్పాడు.

జరిగేది నాకు అర్థమౌతోంది. ఐనా నిర్ధారించుకుందుకు అహమ్మద్ నాకు ఇంగ్లీషులో చెప్పేదాకా ఆగాను.

అక్కడికి దగ్గర్లోనే ఉన్న గ్యోతే స్ట్రాసేలో (వీధి) ఫ్రౌ ఒలోముచ్‌కీ అనే ఆమె ఇంట్లో గది ఒకటి ఆ రోజే కాళీ అవుతున్నదిట. అద్దె నూటయాభై మార్కులు. ఏ దేశస్థుడికైనా అద్దెకివ్వడానికి ఆమెకి అభ్యంతరం లేదుట.

అది జాత్యహంకారం కావచ్చు. మరేమైనా కావచ్చు. ఇండియన్సుకి ఇల్లివ్వడానికి అక్కడ ఒకొక్కరు ఒకో రకం అభ్యంతరం చెబుతారుట. అభ్యంతరం లేనివారు అక్కడ తక్కువేనట. ఒలోముచ్‌కీ ఏ అభ్యంతరం లేదనడం గొప్ప అదృష్టమనీ, వెంటనే వెళ్లి ఆ ఇంట్లో ప్రవేశించడం ఉత్తమమనీ అహమ్మద్ అభిప్రాయపడ్డాడు.

సరేనని నేను వెంటనే జిమ్మర్ పెర్మిట్లుంగ్ వారికి ఐదు మార్కులు ధరావతు కట్టాను. తన మిత్రుడికి కూడా ధరావతు కట్టాలనీ, తన దగ్గర చిల్లర లేదనీ అహమ్మద్ అంటే – అదీ నేనే కట్టాను. తర్వాత ఇస్తానని మాటిచ్చాడు అహమ్మద్. నేను ప్రతిరోజూ డైరీ వ్రాస్తాననీ, అందులో జమాఖర్చుల వివరాలు ఖచ్చితంగా ఉంటాయనీ, తను మాట నిలబెట్టుకోకపోతే ఆ విషయం నా చిట్టాలో నమోదైపోతుందనీ ఆహమ్మద్‌కి తెలియదు. లేకుంటే ఆ ఐదు మార్కులు తిరిగివ్వడం విషయం సీరియస్‌గా తీసుకునేవాడేమో!

ఈలోగా అక్కడి ఉద్యోగి ఒలోముచ్‌కీకి ఫోన్ చేసి ఏదో మాట్లాడాడు. తర్వాత మాతో, “ఫ్రౌ ఒలోముచ్‌కీ ఇప్పుడు ఇంట్లోనే ఉంది. మీతో మాట్లాడేక బయటికి వెడుతుందిట. వెంటనే వెళ్లి కలుసుకోండి” అన్నాడు.

ఇద్దరం నడుచుకుంటూ వాళ్లు చెప్పిన చిరునామాకి వెళ్లాం. అది అనేక అంతస్తులున్న పాతకాలపు భవంతి. లిఫ్టు లేదు. ఒలోముచ్‌కీ ఇల్లు రెండో అంతస్తులో ఉంది.

నడిచి మెట్లెక్కి ఆమె ఇంటి గుమ్మం చేరుకున్నాం.

ఆ ఇంటి తలుపుకి మధ్యలో – వలయానికీ, చదరానికీ మధ్యరకం ఆకారంలో ఉన్న ఓ ఇత్తడి హోల్డర్ ఉంది. అహమ్మద్ దాన్ని పైకెత్తగానే లోపల్నుంచి గణగణమన్న శబ్దం వినబడింది. ఆ హోల్డర్ కాలింగ్‌బెల్ అని అప్పుడర్థమైంది నాకు.

తలుపు తెరుచుకుంది. ఎదురుగా చెయ్యెత్తు మనిషి. కొండంత లావుంది. కాస్తంత భయంకరంగా కూడా ఉంది. అది లంకా నగర ప్రవేశద్వారమా అనుకుని తడబడ్డాను.

ఆ పర్వతాకారం ఫ్రౌ ఒలోముచ్‌కీది. ఆమె వయసు అరవైకి పైన ఎంతైనా ఉండొచ్చు.

అమె ఒంటరి ఆడది. సెక్స్ కీనోలో ఉద్యోగం చేస్తోంది. సెక్స్ కీనో అంటే – ఆగకుండా నీలిచిత్రాలు చూపించే మినీ థియేటర్. అక్కడ ఆమె బుకింగ్ కౌంటర్లో కూర్చుని టికెట్లు అమ్ముతుందిట. ఇప్పుడక్కడికి వెళ్లాల్సిన టైమైంది. మేమొస్తున్నామని ఆగింది.

ఆమె గది చూపించింది. చాలా పెద్దదే కానీ, మామూలుగా జర్మనీలో కనిపించేంత పరిశుభ్రత అక్కడ లేదు.

గదిలో బాగా పాతవైన ఒక పెద్ద బీరువా, మంచం ఉన్నాయి. బాత్రూం, వంటిల్లు గది బయట ఉన్నాయి. అవి ఆమెకీ, నాకూ కామన్.

ఆమె రోజూ ఉదయం పదకొండు ప్రాంతాల ఉద్యోగానికెళ్లి రాత్రి తొమ్మిది దాటేకనే తిరిగొస్తుందిట. తనులేని సమయమంతా నేను వాటిని యథేచ్ఛగా వాడుకోవచ్చునని చెప్పింది.

ఇల్లు సెంట్రల్లీ హీటెడ్. ఐతే కరెంటుతో కాదు. ఆయిల్‌తో కాచిన వెచ్చటి నీరు గొట్టాలద్వారా రోజంతా ప్రవహిస్తూ పరిసరాల్ని ఎప్పుడూ వెచ్చగా ఉంచుతుంది. అందువల్ల ఇంట్లో ఇరవైనాలుగు గంటలూ వేణ్ణీళ్లు లభ్యమౌతాయి. గదిలో మనకి కావలసిన విధంగా ఉష్ణోగ్రతని పెంచుకుందుకూ, తగ్గించుకుందుకూ సదుపాయముంది.

ఆ గదిలో ఓ టర్కిష్ దేశస్థుడు ఉంటున్నాడు. అతడా రాత్రికి గది కాళీ చేస్తున్నాడు. అందుకని మర్నాడుదయం నేను ప్రవేశించవచ్చునందామె. మర్నాడు అక్టోబర్ ఒకటవతేదీ కాబట్టి, లెక్కకి వీలుగానూ ఉంటుందంది.

ఆమె కోరిన విధంగా వెంటనే ఒక నెల అద్దె అడ్వాన్సుగా ఇచ్చాను. వెంటనే ఆమె నాకు రసీదిచ్చింది.

ఇప్పుడిక నేను రాలెక్ కుదిర్చిన స్టూడెంట్ హాస్టలుకు వెళ్లాల్సిన అవసరం లేదని సంతోషమైంది. అంతలో ఆ ఇంటి నంబరు చూశాను. అప్పుడు నా ఆనందం రెట్టింపయింది. ఆ ఇంటి నంబరు ముప్పైఒకటి. తిరగేస్తే పదమూడు. నా లక్కీ నంబర్.

ఇండియాలో నేనెక్కిన ఫ్లైట్ నంబర్లో అంకెలు కలిపితే పదమూడొచ్చింది. ఫ్రాంక్‌ఫుర్ట్‌లో హానోఫర్ వెళ్లడానికి నేనెక్కిన విమానం వచ్చిన ఫ్లాట్‌ఫారం నంబరు పదమూడు. బెర్లిన్ వచ్చేముందు నేనొక ఆదివారంనాడు కూర్ జెంత్రమ్‌లో స్నానం చేశాను. అక్కడ నాకిచ్చిన కూపన్ నంబర్ మూడొందల పదమూడు. భువనేశ్వర్లో నేను కాళీ చేసిన క్వార్టర్ నంబరూ మూడొందల పదమూడే. అంటే టైప్ త్రీలో పదమూడోదన్న మాట!

అంకెలతో జ్యోతిషం చెప్పే సిద్ధాంతాన్ని నమ్మేవాళ్లు చాలామందే ఉన్నారు. నేనది నమ్ముతానని చెప్పలేను కానీ, నా జీవితంలో జరిగిన ప్రతి మంచినీ ఎలాగో అలా పదమూడుతో ముడిపెట్టి తృప్తి పడుతుంటాను. పదమూడు సంఖ్య అశుభ సంకేతమని వినడంవల్ల పట్టుదలగా దాన్ని నా లక్కీ నంబర్‌గా ఎన్నుకున్నానేమో కూడా తెలియదు. పదమూడొస్తే మాత్రం – 'పద, మూడొచ్చింది' – అని కొత్త ఉత్సాహాన్ని తెచ్చుకుంటూంటాను.

ఇప్పుడిలా పదమూడు గురించి బేరీజు వేసుకుని – నా జర్మనీ ప్రయాణం పలువిధాల పదమూడుతో ముడిపడిందంటే – ఇదంతా ఏదో సీక్వెన్స్ ప్రకారం జరుగుతోందనీ, మరిన్ని మరపురాని అనుభూతులు నాకిక్కడ రాసిపెట్టి ఉన్నాయనీ, ఈ ఇంటి నంబరు నాకు శుభశకునమనీ అనుకుంటూ అహమ్మద్ భుజం తట్టి, "పద, మూడొచ్చింది" అని మనసులో అనుకున్నాను.

అప్పుడు అహమ్మద్ నాకు మరో ఉపకారం చేశాడు. "ఈ రాత్రికి ఇతనెక్కడికి పోతాడు? నీ ఇంట్లోనే ఆశ్రయమివ్వు" అన్నాడు అమెతో. ఆమె వెంటనే దానికీ ఒప్పుకుంది. కానీ ఆ రాత్రికి పది మార్కులు అద్దె కట్టాలని ముందే అడిగి తీసుకుంది.

ఆమె అలా ఒక్క రాత్రికి అదనంగా పది మార్కుల అద్దె వసూలు చెయ్యడం నాకు ఆశ్చర్యం కలిగించింది. ఇలాంటి పరిస్థితుల్లో ఇండియాలో ఐతే – హోటళ్లలో ఐతే తప్ప అదనపు ఛార్జి వసూలు చెయ్యరు. ఒక రాత్రికే ఏమిటి, రెండు మూడు రోజుల విషయంలోనూ పెద్దగా పట్టించుకోరు.

ఏదేమైనా ఆ పది మార్కుల ఖర్చు గురించి నేను పెద్దగా విచారించలేదు. ఈ రాత్రికి ఆమె నాకు గది ఇవ్వకపోతే – హటల్లో రూం తీసుకోవాలి. అక్కడికెళ్లడానికి టాక్సీ బాడుగ ఔతుంది. ఆపైన రూంకి అద్దె ఇంతకంటే బాగా ఎక్కువే కట్టాలి. మళ్ళీ ఉదయం ఇంకో టాక్సీ బేరమాడుకుని ఇక్కడికి రావాలి. అలా చూస్తే ఈ ఏర్పాటు చాలా బాగుంది.

అహమ్మదుకీ, ఆమెకీ ధన్యవాదాలు చెప్పాను.

"నీ గురించి ఈ రోజు పెందరాళే వస్తాను. ఎనిమిది దాటేక నీ సామాను తీసుకుని వచ్చేయ్" అంది ఒలోముచ్‌కీ.

మరోసారి ఆమెకి ధన్యవాదాలు చెప్పుకున్నాక – నేనూ అహమ్మదూ అక్కణ్ణించి బయటపడ్డాం.

అప్పుడిక నా మనసు ఆనందోత్సాహాలతో గాల్లో తేలిపోతోంది.

బెర్లిన్ మహానగరంలో నాకు నిలువనీడ దొరికింది. అదీ నెలకి నూటయాభై మార్కులకే. స్నానానికీ, వంటకీ, కరెంటుకీ అదనపు ఛార్జిలు లేవు. రోజుకి ఎన్నిమార్లయినా స్నానం చెయ్యొచ్చు. నాకేమిష్టమైతే అవి వండుకుని తినొచ్చు.

వంటనగానే ఆ విషయమై నా ప్రతిభ గుర్తొచ్చి నవ్వొచ్చింది.

అమ్మ, బామ్మ, ఆ తర్వాత ఇల్లాలు – అందరూ ఇంట్లో ఉండే గృహిణులే. అందువల్ల నాకు వంట నేర్చుకోవాల్సిన అవసరం రాలేదు. అడపాతడపా వంటింటి సాయాలు చేసినా – వంట చెయ్యడంపట్ల పెద్దగా అవగాహన ఏర్పడలేదు. ఆపైన నేర్చుకునే ఆసక్తి కూడా తక్కువ. జర్మనీకి వచ్చేక – ఎప్పటికైనా తప్పనిసరని గ్రహించి – ల్యూనబర్గులో ఉండగా – రామచంద్ర, నటరాజన్, దేవదార్, కొరియాలను చూసి కొంత నేర్చుకున్నాను. ఇంట్లో ఇల్లాలికి సాయం చేస్తూ అభ్యసించినదానికంటే – ఈ మిత్రుల శిక్షణ నాకు బాగా ఉపయుక్తమయింది. ఇండియన్ వంటకాలు చెయ్యడానికి జర్మనీలో లభించే ఏయే పదార్థాల్ని ఎలా ఉపయోగించుకోవాలో కూడా వాళ్లు చెప్పారు.

నా వంట నేను చేసుకుంటే, రోజూ బ్రెడ్‌తో సరిపెట్టుకునే బాధ తప్పుతుంది. తిండి చౌక కూడా ఔతుంది.

ఇలా ఆలోచనలతో బేరీజు వేస్తున్న నన్ను అహమ్మద్ అక్కణ్ణించి యూనివర్సిటీ కాంటీనుకి తీసుకెళ్లాడు. నేను ఫక్తు శాకాహారిననీ, మద్యమాంసాలు ముట్టననీ తెలుసుకుని, "మరి బీరు కూడా తాగవా? కోడిని కూడా తినవా?" అనడిగాడు.

"కోడిగుడ్డు కూడా ముట్టను" అన్నాను.

"అయితే ఇక్కడెలా బ్రతుకుతావ్?" అన్నాడు అహమ్మద్.

"ఏమో, ల్యూనబర్గులో నాలుగు నెలలున్నాను. రుచి గురించేతప్ప బ్రతుకు గురించిన బెంగ కలుగలేదు?" అన్నాను.

"బ్రతకలేవని కాదు. నీ పద్ధతి ఇలాగే కొనసాగిస్తే ఆరోగ్యం క్రమంగా క్షీణించిపోతుంది" అన్నాడు అహమ్మద్.

"అలాగనే అంతా నన్ను భయపెట్టారు. ల్యూనబర్గులో అడుగు పెట్టినప్పుడు నా బరువు నలభైఎనిమిది కేజీలు. ఆ ఊరొదిలేటప్పుడు చూసుకుంటే యాభైఆరు కేజీలు దాటాను. అంటే నెలకో రెండు కేజీల చొప్పున బరువు పెరిగేనన్న మాట!" అన్నాను.

అహమ్మద్ నన్నదోలా చూసి, "నువ్వు చాలా విచిత్రమైన మనిషివిలాగున్నావ్. ఇకముందునుంచి రోజురోజుకీ చలి విపరీతంగా పెరిగిపోతుంది. బ్రాందీ పట్టించకపోతే గడ్డ కట్టిపోతావ్" అని హెచ్చరించాడు.

"అలా గడ్డ కట్టుకుపోతే తప్పకుండా బ్రాందీ పుచ్చుకుంటాను. ఈ విషయంలో నాకేమీ నియమాలు లేవు. అవసరపడనంత కాలం మద్యమాంసాలు ముట్టను. అంతే!" అని హామీ ఇచ్చాను. అలా చెప్పకపోతే, చలి ఇంకా పెరగకపోయినా, నా మాటలకి అప్పుడే ముందు అతను గడ్డకట్టుకుని పోతాడని నాకు భయమేసింది.

అహమ్మద్ కాస్త కుదుటపడి, "మరి నీకు సరదాలేంలేవా?" అన్నాడు.

"సరదాలు లేకేం, బోలెడున్నాయి. మద్యమాంసాలు నాకు సరదా కావంతే!" అన్నాను.

అహమ్మద్ నాకేసి అదోలా చూశాడు. మద్యమాంసాలు కాకుండా ఇంకేం సరదాలుంటాయన్న అనుమానం ఆ చూపులో నాకు కనబడింది.

అక్కణ్ణించి ఇద్దరం డాక్టర్ రాలెక్ వద్దకి వెళ్లాం. ఆయన నాకు ఇల్లు దొరికేసిందని తెలిసి సంతోషించాడు. తర్వాత చకచకా లాబొరేటరీలో నా ప్రోజెక్టుకి సంబంధించిన కొందరు ముఖ్యులకి పరిచయం చేశాడు.

ఆరంతస్తుల ఆ భవనంలో ఎందరో ప్రొఫెసర్లు, రీసెర్చి స్టూడెంట్లు ఉన్నారు. అందరికీ కలిపి ఓ డైరెక్టరున్నాడు. రాలెక్ ముందు నన్ను డైరెక్టరుకి పరిచయం చేశాడు. ఆయన నాకు స్వాగతం పలికి, శుభాకాంక్షలు చెప్పాడు.

డైరెక్టర్ ఆఫీసులో ఒక సెక్రటరీ, ఆ సెక్రటరీకి ఒక అసిస్టెంటు ఉన్నారు. రాలెక్ నన్నా ఇద్దరికీ పరిచయం చేశాడు. ఆ భవంతికి సంబంధించిన మొత్తం పరిపాలన, ఆర్థిక నిర్ణయాలన్నింటి అమలుకీ ఆ సెక్రటరీ, ఆమె అసిస్టెంటు సరిపోతారని తెలిసేక పెద్ద షాక్ తిన్నాను.

భువనేశ్వర్లో మా రీసెర్చి సంస్థ మూడంతస్తుల పెద్ద భవనంలో ఉంది. అందులో మా వ్యవహారాలు చూడ్డానికి ఒక అడ్మినిస్ట్రేటివ్ సెక్షన్, అకౌంట్ సెక్షన్, పర్చేజ్ సెక్షన్ ఉన్నాయి. ప్రతి సెక్షనుకీ ఓ అధికారి, అతడికింద అనేకమంది ఉద్యోగులూ ఉన్నారు. అక్కడ అందరు, ఇక్కడ ఇద్దరు!

డాక్టర్ రాలెక్ నన్ను ముందు గ్లాస్ బ్లోవర్ వద్దకు తీసుకెళ్లాడు. వేడిమీద గాజుని కరిగించి నోటితో బుడగల్లా ఊది ఎలాంటి గాజు పరికరాన్నయినా తయారు చేసే ఉద్యోగమతడిది. కెమిస్ట్రీ, కెమికల్ ఇంజనీరింగ్ రీసెర్చికి ఎంతో అవసరమైన ఉద్యోగి అతడు. అతణ్ణి చూడగానే మా లేబరేటరీలో గ్లాస్ బ్లోవర్ హైదరాలీ గుర్తుకొచ్చాడు. గాజుని వెన్నముద్దలా మార్చగల అతడి ప్రావీణ్యానికి అబ్బురపడి గాజు మాంత్రికుడని పిలిచేవాళ్లం మేమతణ్ణి.

తర్వాత రాలెక్ నన్ను వర్క్‌షాప్ ఇంజనీరుకీ, స్టోర్‌కీపర్‌కీ కూడా పరిచయం చేసేక, తన డిపార్టుమెంట్లోని రీసెర్చి వర్కర్సందరికీ పరిచయం చేశాడు.

ఆ భవంతిలోనే ఒక గదిలో ఆటోమేటిక్ జిరాక్స్ మెషీన్ ఉంది. మన అవసరాన్ని బట్టి ఒకే పేజీకి – ఒకటి, రెండు, ఐదు లేక పది కాపీల్ని – మనకి కావాల్సిన సైజులో తీసుకోవచ్చు. ఆ గది తాళం డైరెక్టర్ ఆఫీసు గదిలో ఉంటుంది. ఎవరికి అవసరపడితే వారు అక్కణ్ణించి ఆ తాళం తీసుకుని, జిరాక్సు గదికి వెళ్లి జిరాక్సు కాపీలు తీసుకోవచ్చు.

అప్పటికి నాకు అలాంటి జిరాక్స్ మెషీన్ కొత్త. అందుకని ఆ సదుపాయం చూడగానే నాకు పెన్నిధి దొరికినట్లయింది.

భువనేశ్వర్ లాబొరేటరీలోనూ మాకో ఫొటోకాపీ మిషనుందిట. అది ఇలా ఆటోమేటిక్ కాదు. కాపర్ సల్ఫేట్ రసాయనాన్ని వాడి దాన్ని సిద్ధం చెయ్యాలి. ఒకసారి సిద్ధంచేస్తే నాలుగంటే నాలుగు కాపీలు మాత్రం వస్తాయి. ఇంతకీ ఆ సదుపాయం ఉపయోగించుకోవడానికి ముందు ఓ అప్లికేషన్ ఫారం రాయాలి. దానిమీద ఆ సెక్షన్ హెడ్ సంతకం చెయ్యాలి. ఆ మెషీన్లో కాపీ తీయించుకోవడంకంటే, టైపు చేయించుకోవడమే సుఖం. అందువల్ల లాబొరేటరీలో చాలామందికి అదున్నట్లే తెలియదు. అబద్ధమెందుకూ, దాని గురించి నాకూ ఇక్కడికొచ్చేకే తెలిసింది. నేను చూసిన ఆటోమేటిక్ జిరాక్సు మెషీన్ గురించి మా ఆఫీసు మిత్రులకు ఉత్తరం వ్రాసినప్పుడు వారీ వివరాలిచ్చారు.

మన గురించి మనం తెలుసుకుందుకు కూడా విదేశం రావాలన్న మాట!

మర్నాడే డాక్టర్ రాలెక్ ఫ్రాంక్‌ఫుర్ట్ వెడుతున్నాట్ట. వారం రోజులవరకూ తిరిగిరాడుట. ఆయన నాకు నేను కూర్చునే సీటు, పని చెయ్యాల్సిన వర్క్ బెంచ్ చూపించాడు. అప్పటికే నాకోసం ఓ ఆప్రాన్ తెప్పించి ఉంచాడు. పని చేసుకుందుకు అక్కడున్న బర్నర్స్, ఫర్నేసులూ వగైరాలు చూపించాడు. డిపార్టుమెంటుకి ఎప్పుడుపడితే అప్పుడు వచ్చిపోవడానికి మెయిన్ డోర్ తాళంచెవి ఒకటిచ్చాడు. నాతో చాలా అప్యాయంగా మాట్లాడి నాకున్న బెదురు చాలావరకూ పోగొట్టాడు.

ఇన్‌స్టిట్యూట్ ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఐదు వరకూ పని చేస్తుంది. మధ్యలో ఓ గంట భోజన విరామం. శని, ఆదివారాలు సెలవు.

అక్కడ పనివేళల్లో ఎవరి పనుల్లో వారుంటారు. నేనూ నా పనికి సంబంధించి అన్నీ సెట్ చేసుకుంటూంటే తెలియకుండానే అయిదైపోయింది. అప్పుడు నాకు నేనుగా ఆఫీసునుంచి బయటపడ్డాను.

అక్కడి షాపులు నాకో పెద్ద ఆకర్షణ కదా! బయటికి రాగానే కాసేపు రోడ్లమీద తిరిగి షాపుల్ని గమనించాను.

బెర్లిన్లో షాపులు సాయంత్రం ఆరున్నరదాకానే ఉంటాయి. ఆలోగానే కొన్ని సూపర్ మార్కెట్లలో తిరిగి నాకు అవసరమైన వస్తువుల ధరలు సర్వే చేశాను. ధరలు ఇంచుమించు ల్యానబర్గ్‌లోలాగే ఉన్నాయి. ఐతే ఎంత వెదికినా నేను చూసిన మేరకు ఆల్‌బ్రెస్ట్ షాపు కనబడలేదు.

రాత్రి దగ్గర పడుతున్నకొద్దీ చలి పెరుగుతోంది. అందుకని షాపులు మూసేసే సమయానికి రైల్వే స్టేషన్ చేరుకున్నాను – అక్కడైతే వెచ్చగా ఉంటుందని. తీరా చూస్తే అక్కడి వాతావరణం నేనూహించనిది.

స్టేషన్లో టాయిలెట్స్ నేలమాళిగ (అండర్‌గ్రౌండ్)లో ఉన్నాయి. దానిలోకి వెళ్లడానికి మెట్లదారి ఉంది. ఆ దారి పొడుగునా మెట్లపక్కన తాగుబోతులు బారులు తీరి కూర్చుని ఉన్నారు. వాళ్లలో ఒకరిద్దరు ఆడవాళ్లు కూడా ఉన్నారు.

ఆ దృశ్యం చూడగానే ఇండియాలో బిచ్చగాళ్లు గుర్తొచ్చారు. నేను వెడుతున్నది దేవాలయానికా, శౌచాలయానికా అన్న అనుమానం కలిగింది.

అక్కడ కూర్చున్నవాళ్లు అడుక్కోవడం లేదు కానీ – వాళ్ల మాట, ప్రవర్తన ఏవగింపు కలిగిస్తున్నాయి. వాళ్లు పెద్దగా కేకలు వేస్తూ, వెకిలిగా నానా అల్లరీ చేస్తున్నారు.

చెప్పాలంటే చాలా నిరుత్సాహపడ్డాను.

ఒక ఆధునిక సంపన్న దేశానికి చెందిన ప్రతిష్ఠాత్మక మహానగరం బెర్లిన్. అలాంటినగరంలో పర్యాటకులు తప్పనిసరిగా సందర్శించే రైల్వేస్టేషన్లో అటువంటి దృశ్యం చూడాల్సి ఉంటుందని నేననుకోలేదు. నగర పాలకులు ఈ విషయాన్ని ఎందుకు పట్టించుకోలేదోనని ఆశ్చర్యం కలిగింది.

తాగుబోతుల విషయం అలాగుంచితే – రైల్వే స్టేషన్ మాత్రం మహా సందడిగా ఉంది. ఆ సందడి చూస్తూ నేను అటూ ఇటూ తిరుగుతున్నాను.

చాలాసేపట్నుంచి అక్కడే తిరుగుతున్న ఒకామె నన్ను గమనించినట్లుంది – ఉన్నట్లుండి సైగ చేసి నన్ను పిలిచింది.

ఆమె వయసు నలభై సంవత్సరాలుండొచ్చు. ముఖం చూస్తే చందమామ పత్రికలోని బొమ్మల్లో మంత్రగత్తె గుర్తుకొస్తుంది. చూపులు కూడా మంత్రగత్తె చూపుల్లాగే వంకరగా ఉన్నాయి.

నేను దగ్గరకు వెళ్లగానే, "ఇండియన్?" అందామె ఇంగ్లీషులో. ఔనన్నాను.

ఆమె చేయి జాపింది. షేక్‌హాండిచ్చాను. చెయ్యి వదిలిపెడుతూ అమె నా బొటనవ్రేలిని అదోలా గోకింది.

కంగారుగా ఆమె వంక చూశాను. వెంటనే కన్ను కొట్టింది.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments